సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



కోతకు గురైన జోలాపుట్టు వంతెన

ముంచంగిపుట్టు: ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో ఐరెన్ వంతెన మంగళవారం వరద ఉధృతికి కోతకు గురైంది. జోలాపుట్టు జలాశయం నుంచి మూడు రోజులుగా 30 నుంచి 50 వేల క్యూసెక్కుల వరదనీరు ఒకేసారి విడుదల చేశారు. దీంతో నీటి ప్రవాహ ఉధృతికి ఐరెన్ వంతెన ముందు భాగం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. 15 సంవత్సరాల తరువాత భారీస్థాయిలో వంతెనపై నుంచి ప్రవహించడంతో కోతకు గురైందని, ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి పూర్తిస్థాయి వంతెన నిర్మించి, రాకపోకలకు అవస్థలు తప్పించాలని జోలాపుట్టు ఆర్‌ఎఫ్, ఎల్‌ఎఫ్ ప్రజలు కోరుతున్నారు.

← కోతకు గురైన వంతెన ముందు భాగం



ఎన్నాళ్లీ కష్టాలు: చింతూరులో వరద నీటిలో ప్రజల రాకపోకలు



ఇంకా ఎన్నిరోజులో: శబరి వంతెనపై టెంట్లలో వరద బాధితులు



ఎంత కష్టం: చింతూరులో సామాన్లతో సురక్షిత ప్రాంతాలకు..

ఊళ్లలో కన్నీరు

గోదావరి, శబరి నదులు **ఒక్కసారిగా** ఉగ్రరూపం దాల్చాయి. **భద్రాచలం వద్ద** గోదావరి నీటిమట్టం **మంగళవారం** రాత్రి 9 గంటలకు 49 **అడుగులకు** చేరడంతో రెండో ప్రమాద **హెచ్చరికను** జారీ చేశారు. చింతూరు, **వడ్డిగూడెం,** వడ్డిగూడెం కాలనీ, **పాతరాజుపేట,** చింతరేగుపల్లి, శ్రీరామగిరి, **ములకనపల్లి** ప్రాంతాలు ముంపునకు **గురయ్యాయి.** ఇళ్లల్లోకి నీరు **చేరుతుండటంతో** వరద తాకిడికి విలీన **మండలాల ప్రజలు** చిగురుటాకుల్లా **వణికిపోతున్నారు. నీట** మునగడంతో సుమారు **80 గ్రామాలకు** పైగా రాకపోకలు **నిలిచిపోయాయి.**

- ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి, శబరి నదులు
- భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ
- గ్రామాలను ముంచెత్తుతున్న వరదనీరు
- 80 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- సురక్షిత ప్రాంతాలకు బాధితుల తరలింపు



కూనవరం: ముందస్తుగా సామగ్రిని తరలిస్తున్న ఎంపీడీవో, రెవెన్యూ అధికారులు



కూనవరం: శబరి బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి



కూనవరం: గిన్నెలబజారులో ఇళ్లలోకి చేరిన గోదావరి, శబరి వరద నీరు

చింతూరు: మేడిగడ్డ, శ్రీరాంసాగర్, తాలిపేరు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తున్నందున భద్రాచలం వద్ద గోదావరి వరద ఒక్కసారిగా పెరిగింది. సోమవారం ఉదయం భద్రాచలం వద్ద 26 అడుగులు ఉన్న నీటిమట్టం మంగళవారం రాత్రి 9 గంటలకు 49 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. కూనవరం వద్ద 46.6 అడుగులకు చేరిన గోదావరి మూడో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. చింతూరు వద్ద శబరినది 45 అడుగులకు చేరుకుని ప్రమాదకర స్థాయికి మించి ప్రవహిస్తోంది. దీంతో ఈ రెండు నదుల వల్ల చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాలపై వరద ప్రభావం ఎక్కువగా ఉంది. సుమారు 80 గ్రామాలకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి.

- ఎటపాక మండలంలో వీరాయిగూడెం, మురుమూరు వద్ద వరదనీరు రహదారిపైకి చేరడంతో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- కూనవరం మండలంలో పోలిపాక, కొండ్రాజుపేట, పండ్రాజుపల్లి ప్రాంతాల్లో వరదనీరు రహదారులపైకి చేరడంతో 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.
- లోతట్టు ప్రాంతమైన శబరి కొత్తగూడెంతో పాటు కూనవరంలోని ఉదయ్‌భాస్కర్ కాలనీ, గిన్నెలబజారు ప్రాంతాలను అధికారులు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- వీఆర్‌పురం మండలంలో వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, పాతరాజుపేట, చింతరేగుపల్లి, శ్రీరామగిరి, ములకనపల్లి గ్రామాల్లోకి వరదనీరు ప్రవేశించింది. పది చోట్ల రహదారులు ముంపునకు గురికావడంతో 35 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆయా ప్రాంతాల్లో అత్యవసరమైన వారిని నాటు పడవల ద్వారా తరలిస్తున్నట్లు వీఆర్‌పురం తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు.
- చింతూరు మండలంలో 420, వీఆర్‌పురం మండలంలో 200, కూనవరంలో 554 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఐటీడీఏ పీవో అపూర్వభరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ముంపు ప్రాంతాల్లో పర్యటించి సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. నాలుగు మండలాల్లో వందలాది ఎకరాల్లో వరిపంటలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

గ్రామాల్లోకి 'శబరి'

డొంకరాయి జలాశయం నుంచి వస్తున్న వరద నీటితోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న వరదనీటితో శబరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. సోమవారం వరకు రహదారులపై ప్రవహించిన వరదనీరు మంగళవారం నాటికి క్రమేపీ గ్రామాల్లోకి ప్రవేశించి ఇళ్లను ముంచెత్తుతోంది.

- చింతూరులోని శబరి ఒడ్డు, సంతపాకలు, టోల్‌గేట్ సెంటర్, వీఆర్‌పురం రోడ్డు ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి. దీంతో అధికారులు ఆయా ప్రాంతాల్లో ఇళ్లను ఖాళీచేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శబరిఒడ్డు ప్రాంతానికి చెందిన బాధితులు ఇళ్లను వదిలి వెళ్లలేక వంతెన పైభాగంలో టెంట్లు వేసుకుని వాటిలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.
- వరదనీరు రహదారులను ముంచెత్తడంతో చాలా గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఏజీకొడేరులో శబరిఒడ్డు ప్రాంతాన్ని వరదనీరు చుట్టుముట్టడంతో 30 కుటుంబాలు ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాయి.
- డివిజన్ కేంద్రమైన చింతూరును వరదనీరు ముంచెత్తడంతో చింతూరు నుంచి చట్టి, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లకు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాల్లో అనారోగ్యానికి గురైన వారిని పడవల ద్వారా చింతూరు తరలించి అక్కడినుంచి అంబులెన్సుల్లో ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స అందిస్తున్నారు.

కూనవరం: గోదావరి, శబరి ఉగ్రరూపం దాల్చడంతో లోతట్టు గ్రామాలతోపాటు రహదారులు ముంపునకు గురయ్యాయి. కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిని పోలిపాక, ముర్మూరు వద్ద వరదనీరు ముంచెత్తింది. దీంతో భద్రాచలం నుంచి రాకపోకలు స్తంభించాయి. టేకులబోరు నుంచి కొండ్రాజుపేట ప్రధాన రహదారిపైకి శబరి వరద నీరు భారీగా చేరింది. దీనివల్ల కొండ్రాజుపేట, టేకులబోరు మధ్యలో ఏడు గ్రామాలకు రాకపోకలు నిలిపోయాయి. జగ్గవరం నుంచి చింతూరు వెళ్లే రహదారిలో కోతులగుట్ట, పండ్రాజుపల్లి మధ్యలో వరదనీరు చేరడంతో 25 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దూగుట్ట, కూళ్ళపాడు, కొండాయిగూడెం, కరకగూడెం, కొండ్రాజుపేట, వెంకన్నగూడెం తదితర చోట్లు అంతర్గత రహదారులు ముంపునకు గురయ్యాయి. ముంపుప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తహసీల్దార్ నాగబాబు తెలిపారు.

విలీనంలో గోదావరి గుబులు

ఎటపాక: గోదావరి వరద గండం మళ్లీ తప్పదనే సంకేతాలతో విలీన మండలాల వాసులు భయందోళన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక దాటడంతో మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. తాలిపేరు ప్రాజెక్టుతో పాటు పాల్వంచ కిన్నెరసాని నది నుంచి కూడా వరదనీరు గోదావరిలోకి విడుదల అవుతోంది. ఇప్పటికే రాయనపేట వద్ద జాతీయ రహదారిపైకి వరద చేరడంతో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. నెల్లిపాక నుంచి కూనవరం వెళ్లే రహదారి నెల్లిపాక, నందిగామ, మురుమూరు వద్ద ముంపునకు గురైంది. భద్రాచలం ప్రధాన రహదారి నుంచి గౌరిదేవిపేట వెళ్లే రహదారి నీటమునిగింది. తోటపల్లి, నందిగామ, మురుమూరు ప్రాంతాల్లో పత్తి పైరు నీటమునిగింది.



కూనవరం: పోలిపాక, ముర్మూరు మధ్య రోడ్డుపైకి చేరిన వరద నీరు



చింతూరు: నీటమునిగిన శబరిఒడ్డు ప్రాంతం



ఎటపాక: నీటమునిగిన గౌరిదేవిపేట రహదారి

వారం రోజుల్లో యథాస్థితికి మాచ్‌ఖండ్

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని వారం రోజుల్లో యథాస్థితికి తీసుకువచ్చి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తామని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు తెలిపారు. వరద నీరు చేరి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసిన మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వరద నీటిలో ఉన్న జనరేటర్లను పరిశీలించారు. ప్రాజెక్టులోకి నీరు రావడానికి గల కారణాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. సకాలంలో స్పందించి, విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి, ప్రాజెక్టుకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకున్న సిబ్బందిని అభినందించారు. రానున్న రోజుల్లో మాచ్‌ఖండ్ ప్రాజెక్టులోకి నీరు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. డుడుమ, జోలాపుట్టు జలాశయాల నీటి మట్టాలు, నీటి విడుదలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెడుతున్నామని, వారం రోజుల్లో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. నీరు ప్రవేశించడం తప్ప ఎటువంటి నష్టం వాటిల్లలేదన్నారు. ఆయన వెంట ఎస్ఈ విద్యుత్ సౌధ శ్యాంసుందర్, సీలేరు కాంప్లెక్స్ సివిల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, మాచ్‌ఖండ్ ఎస్ఈ ఏవీ సుబ్రహ్మణ్యేశ్వరావు, ఈఈ గోవిందరాజులు, డీఈలు బ్రజసుందర్‌పాడి, సత్యకిరణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నిరాశపర్చిన మంత్రి పర్యటన



అంతర్లలో మంత్రిని కలిసేందుకు వేచి ఉన్న గిరిజన మహిళలు

చింతపల్లి: మండలంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పర్యటన టీడీపీ శ్రేణులు, గిరిజనులను నిరాశ పర్చింది. వరద నష్టాన్ని పరిశీలించేందుకు మంగళవారం చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల్లో ఆమె పర్యటించారు. అధికారిక పర్యటన కావడంతో ఈ విషయం సోమవారమే అందరికీ తెలిసింది. దీంతో ఈ ప్రాంతానికి వస్తున్న ఆమెకు స్వాగతం పలికేందుకు కొత్రుబయలులో టీడీపీ నేతల ఆధ్వర్యంలో మహిళలు వేచి ఉన్నారు. అదేవిధంగా అంతర్లలోను మంత్రిని కలిసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చారు. ఉదయం 11 గంటల సమయంలో లంబసింగి వచ్చిన మంత్రి ఆగకుండా నేరుగా పర్యాటకశాఖ రిసార్ట్స్‌కు వెళ్లిపోయారు. దీంతో కొత్రుబయలు వద్ద వేచి ఉన్న టీడీపీ శ్రేణులు నిరాశకు గురయ్యారు. అంతర్లలో వేచి ఉన్న వారికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెళ్లిన మంత్రి అంతర్లలో తమ వాహనాన్ని ఆపారు. అప్పటి వరకు వేచి ఉన్నవారంతా ఇళ్లకు వెళ్లిపోయారు. తమ సామాజిక వర్గానికి చెందిన మంత్రి వస్తున్నారన్న ఎంతో ఆశతో ఎదురుచూసిన గిరిజనులు మంత్రి తీరుకు కంగుతిన్నారు.

నేడు విలీన మండలాల్లో విద్యాసంస్థలకు సెలవు

సాక్షి,పాడేరు: చింతూరు డివిజన్‌లో వర్షాలు, వరదలు నేపథ్యంలో నాలుగు విలీన మండలాల్లో విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక, చింతూరు మండలాల్లోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలను తెరవవద్దని ఆయన ఒక ప్రకటనలో సూచించారు.

డుడుమ, జోలాపుట్టుకు తగ్గని వరద పోటు

- ప్రాజెక్ట్‌ల్లోకి భారీగా ఇన్‌ఫ్లో
- రెండింటి నుంచి 83 వేల క్యూసెక్కుల విడుదల





డుడుమ, జోలాపుట్టు నుంచి విడుదల అవుతున్న నీరు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే ప్రధాన డుడుమ,జోలాపుట్టు జలాశయాలకు వరద తాకిడి తగ్గడం లేదు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయాల నీటి మట్టాలు గణనీయంగా పెరుగుతున్నాయి. డుడుమ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 2590 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 2588.20 అడుగులుగా నమోదయింది. దీంతో అప్రమత్తమైన జలాశయ సిబ్బంది. 3,5,7,8 గేట్లను ఎత్తి 40వేల క్యూసెక్కులను బలిమెల జలాశయానికి విడుదల చేస్తున్నారు. జోలాపుట్టు జలాశయ నీటి మట్టం సైతం ప్రమాద స్థాయికి చేరుకుంది. దీని నీటి సామర్థ్యం 2750 అడుగులు కాగా సోమవారం రాత్రి ఏడు గంటలకు 2747.30 అడుగుల మేర నీరు ఉంది. దీంతో జలాశయ సిబ్బంది ఒడిశా స్పిల్‌వే జలాశయం నుంచి ఆరు గేట్లు ఎత్తి 38,500,ఆంధ్రా ప్రధాన జలాశయం నుంచి 4,500 క్యూసెక్కుల చొప్పున మొత్తం జోలాపుట్టు నుంచి 43 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఉదయం ఇన్‌ఫ్లో తగ్గడంతో 20 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్న తరుణంలో మధ్యాహ్నం మళ్లీ ఒక్కసారిగా జోలాపుట్టు జలాశయంలో నీటి మట్టం పెరిగింది. దీంతో 43వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

తేరుకోని చట్రాపల్లి

కొండ చరియలు విరిగిన పడిన ఘటన నుంచి చట్రాపల్లి గిరిజనులు ఇప్పటికీ తేరుకోలేదు. వాతావరణ హెచ్చరికలు వారిలో దడ పుట్టిస్తున్నాయి. ప్రకృతి విధ్వంసానికి ఇప్పటికే ఈ గ్రామానికి అన్నిదారులు మూసుకుపోయాయి. తినేందుకు తిండిలేక.. తాగేందుకు నీళ్లు లేక అర్ధాకలితో కాలం గడుపుతున్నారు. పరామర్శించేందుకు వచ్చేవారు ఎవరైనా సాయం చేయకపోతారా అన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

- భయం గుప్పెట్లో గ్రామ గిరిజనులు
- కొండచరియల విధ్వంసానికి ధ్వంసమైన రహదారి
- వాగుల ప్రవాహానికి కొట్టుకుపోయిన వంతెనలు
- ఎట్టకేలకు గ్రామానికి చేరుకున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు



ప్రకృతి ప్రకోపానికి ధ్వంసమైన చట్రాపల్లి గ్రామం



గూడెంకొత్తవీధి మండలంలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



చట్రాపల్లిలో కుమారి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



తీవ్రంగా గాయపడి సప్పర్ల పీహెచ్‌సీకి పరిమితమైన బాధితురాలు

సీలేరు: గాలికొండ పంచాయతీ పరిధిలో ఉన్న చట్రాపల్లి గ్రామంలో సుమారు 33 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి ఈ గ్రామంపై కొండచరియలు విరిగి పడటం తెలిసిందే. ఈ ఘటనలో గిరి మహిళ కుమారి మృతి చెందగా, పండన్న, సుమిత్ర, కొర్రా సుబ్బారావు గాయపడ్డారు. ఈ ఘటనతో ఉలిక్కిపడిన గ్రామ గిరిజనులు ఇప్పటికీ ఆ భయం నుంచి తేరుకోలేదు. మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు వారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే విధ్వంసం సృష్టించిన కొండచరియలు మళ్లీ విరుచుకుపడితే మా పరిస్థితి ఏంటని వారు ఆవేదన చెందుతున్నారు. జీకేవీధి–సీలేరు మార్గంలో పంచాయతీ కేంద్రమైన గాలికొండకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో చట్రాపల్లి ఉంది. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం ఉన్నప్పటికీ బండరాళ్లు కొట్టుకురావడంతో పూర్తిగా ధ్వంసమైంది. కొండగెడ్డల ప్రవాహానికి కోతకు గురైంది.వంతెనలు కొట్టుకుపోయాయి. ఈ పరిస్థితుల్లో ఆ గ్రామానికి వెళ్లేందుకు సోమవారం అధికారులు ప్రయత్నించినప్పటికీ మార్గం పూర్తిగా ధ్వంసమవడంతో అక్కడికి వెళ్లేందుకు సాధ్యం కాలేదు. మంగళవారం కూడా అదే పరిస్థితి. జారిపడిన కొండ చరియలను జేసీబీతో తొలగిస్తున్నా మట్టి దిబ్బలు జారిపడుతున్నాయి.

సప్పర్ల పీహెచ్‌సీకి పరిమితం

చట్రాపల్లిలో కొండచరియలు విరిగి పడిన ఘటనలో క్షతగాత్రులు కొర్రా పండన్న, కొర్రా సుమిత్ర, కొర్రా సుబ్బారావు పరిస్థితి దయనీయంగా ఉంది. తీవ్రంగా గాయపడిన వీరిని నానా అవస్థలు పడి సప్పర్ల పీహెచ్‌సీకి తీసుకురావడంతో వైద్యం అందిస్తున్నారు. వీరికి కాళ్లు చేతులు విరిగి పోవడంతో వెంటనే శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. అయితే అక్కడి నుంచి వీరిని ఎటూ తీసుకువెళ్లలేని పరిస్థితి నెలకొంది. సప్పర్ల నుంచి చింతూరు వెళ్లే మార్గంలో చాలా చోట్ల కొండచరియలు విరిగిపడి ఘాట్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. చింతపల్లి తీసుకువచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. సప్పర్ల నుంచి జీకేవీధి వరకు కొండ చరియల విధ్వంసానికి రోడ్డు రూపురేఖలు లేకుండా పోయింది. దీంతో క్షతగాత్రులు ముగ్గురు ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో మంగళవారం నానా అవస్థలు పడి అతికష్టం మీద సప్పర్ల ఆస్పత్రికి సీలేరు ఎస్ఐ రామకృష్ణ, చింతపల్లి, గూడెంకొత్తవీధి ఎంపీపీలు అనుష్కదేవి, కుమారి, జెడ్పీటీసీ కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ చేరుకున్నారు. వారిని పరామర్శించారు. అనంతరం అక్కడి నుంచి ధ్వంసమైన మార్గంలో సాయంత్రానికి గ్రామానికి చేరుకుని గిరిజనులకు ధైర్యం చెప్పారు. పోలీసులు వైద్యుడిని గ్రామానికి తీసుకువెళ్లి కుమారి మృతదేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

అర్ధాకలితో..

రెక్కల కష్టం మీద జీవనం సాగించే చట్రాపల్లి గిరిజనులు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఏరోజు వచ్చిన ఆదాయంతో ఆ మరుసటి రోజు పంచాయతీ కేంద్రానికి వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకుంటారు. భారీ వర్షాలు కారణంగా ఐదు రోజుల నుంచి ఇళ్లకు పరిమితమయ్యారు. అంతకు ముందు తెచ్చుకున్న సరుకులు అయిపోవడంతో అర్ధాకలితో కాలం గడుపుతున్నారు. గ్రామానికి వచ్చేవారు ఎవరైనా సాయం చేయకపోతారా అన్న ఆశతో కాలం ఎదురు చూస్తున్నారు. కాలినడకన వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తున్నందున ఈ పరిస్థితుల్లో వారికి నిత్యావసర సరకులు ఇప్పటిలో అందే పరిస్థితి కనిపించడం లేదు.

చట్రాపల్లి వెళ్లేందుకు సాహసించిన ఎమ్మెల్యే

సీలేరు: కొండచరియలు విధ్వంసం సృష్టించిన చట్రాపల్లి గ్రామానికి వెళ్లేందుకు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మంగళవారం సాహసించారు. దీనిలో భాగంగా లంకపాకలు వరకు వచ్చారు. అయితే గాలికొండ పంచాయతీ పరిధిలోని గ్రామాలు మావోయిస్టు ప్రభావితం కావడం వల్ల భద్రత దృష్ట్యా అక్కడికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించలేదు. దీంతో మండలంలో భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారికి సత్వర న్యాయం చేసేలా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులందరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. చాలా చోట్ల వంతెనలు ,రోడ్లు, కల్వర్టులు పూర్తిగా కొట్టుకుపోయాయన్నారు. వేలాది ఎకరాల్లో పంట ముంపునకు గురై దెబ్బతిందన్నారు. తక్షణం బాధితులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎంపీపీ కుమారి, అనుష్కదేవి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, వైస్ ఎంపీపీ దేముడు, జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీటీసీ ఈశ్వరమ్మ ఉన్నారు.

క్లుప్తంగా

విద్యాలయాలను తనిఖీ చేసిన న్యాయమూర్తి



గురుకుల పాఠశాల రికార్డులు తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి బాబు

అడ్డతీగల: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వులను అనుసరించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం అడ్డతీగలలోని పలు విద్యాలయాలను స్థానిక జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి ఎ.బాబు తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల, కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న మెనూ తెలుసుకున్నారు. ఆయా విద్యాలయాల్లో సౌకర్యాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి స్టాకు వివరాలను ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి



వంతెనను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటి విడుదలతో రంగబయలు, వనుగుమ్మ, దొడిపుట్టు, జోలాపుట్టు, మాకవరం పంచాయతీల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి కోరారు. జోలాపుట్టు పంచాయతీలో కోతకు గురైన సరిహద్దు వంతెనను ఆమె మంగళవారం పరిశీలించారు. జలాశయాల్లో నీటి విడుదల, నిల్వలపై ఆరా తీశారు. మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాలతో పాటు జలాశయాల నీటి విడుదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, గెడ్డలు దాటవద్దని, చేపల వేటకు వెళ్లవద్దని కోరారు. అత్యవసర పరిస్థితులు వస్తే ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని, తుఫాన్ తగ్గేంత వరకు వీలైనంతవరకు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని సూచించారు.

స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని నిరసన



వైద్యాధికారికి వినతి పత్రం అందజేస్తున్న స్టాఫ్ నర్సులు



అరకులోయ ఏరియా ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బంది

దుంబ్రిగుడ: కాంట్రాక్టు ప్రాతిపదికన పీహెచ్‌సీలో విధులు చేపడుతున్న తమను క్రమబద్ధీకరించాలని స్టాఫ్ నర్సులు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆ సంఘం నాయకులు దీన, కొండమ్మ మాట్లాడుతూ 24 గంటల ఆస్పత్రుల్లో గిరిజనులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, తమ కష్టాలను గుర్తించి క్రమబద్ధీకరణలో జాప్యం చేస్తుండటంతో కుటుంబాలతో రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని కోరారు. మరో అదనపు వైద్యాధికారి అంబికారమణి పాల్గొన్నారు.

115 జీవో రద్దు చేయాలని డిమాండ్

అరకులోయ రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో వైద్య సిబ్బంది మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ స్ట్రగుల్ కమిటీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. ఆస్పత్రిలో ఏఎన్ఎంలుగా రెండేళ్ల శిక్షణ ఇస్తూ జీవో నంబర్ 115 ద్వారా స్టాఫ్ నర్సులుగా పదోన్నతులు కల్పించడం తగదన్నారు. ఇప్పటికే 15 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందికి అన్యాయం చేయొద్దన్నారు. తక్షణమే జీవో నంబర్ 115ను రద్దు చేయాలని, లేని పక్షంలో దశలవారీగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బుజ్జి, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

చింతపల్లి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదుట స్టాఫ్ నర్సులు ధర్నా చేపట్టారు. భోజన విరామ సమయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం 115 జీవోను రద్దు చేయాలని స్టాఫ్ నర్సులకు పరస్పర సాధారణ బదిలీలు కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన వైద్యులు

అడ్డతీగల: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా కుదిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 85కి నిరసనగా పీహెచ్‌సీల వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మంగళవారం దుప్పులపాలెం, ఎల్లవరం పీహెచ్‌సీల్లో వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి ఓపీ సేవలు నిర్వహించారు. జీవో వల్ల తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. కోవిడ్-19 సమయంలో తమ ప్రాణాలను ప్రమాదంలో పెట్టి సేవలు అందించినప్పటికీ ఇప్పుడు జీవో 85 ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ఇది ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందన్నారు.

జీవో నంబర్ 85తో వైద్యులకు అన్యాయం

అరకులోయ రూరల్: జీవో నంబర్ 85తో పీహెచ్‌సీ వైద్యులకు తీరని అన్యాయమని గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ కమలకుమారి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం గన్నెల, సుంకరమెట్ట, మాడగడ పీహెచ్‌సీ వైద్యాధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసన తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు దశల వారీగా నిరసన కొనసాగిస్తామన్నారు. వైద్యాధికారులు నాయుడు, ఉపేంద్ర, ఉదయ్‌ప్రశాంత్ పాల్గొన్నారు.



ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న స్టాఫ్ నర్సులు



దుప్పులపాలెం పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తం

- ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపదమిత్ర బృందం
- హోం శాఖ మంత్రి అనిత



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

మహారాణిపేట: ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు జరిగిన నష్టాలు, సహాయక చర్యలపై ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపదమిత్ర బృందాలను సిద్ధం చేసి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవలసిన సహాయక చర్యలపై శిక్షణను ఇవ్వనున్నామన్నారు. ఆయా జిల్లాల్లో జలాశయాల స్థితిగతులపై కలెక్టర్ సమీక్షించాలని తెలిపారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాల సమయంలో ఎక్కడికక్కడ సహాయక చర్యలు చేపట్టామన్నారు. ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, పి.భాస్కరరెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, మత్స్య, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

131 మంది గర్భిణుల ముందస్తు తరలింపు



గర్భిణులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య

కూనవరం: గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా 131 మంది గర్భిణులను కూనవరం, చింతూరు సీహెచ్‌సీలకు తరలించి ప్రత్యేక సేవలు అందిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు. స్థానిక కోతులగుట్ట సీహెచ్‌సీకి తరలించిన గర్భిణులకు అందుతున్న సేవలను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల కారణంగా చింతూరు డివిజన్‌లో రహదారులు ముంపునకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో గర్భిణులు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తుగా కూనవరం, చింతూరు ఏరియా ఆస్పత్రులకు తరలించామని తెలిపారు. ఆరోగ్యపరమైన వీరి సమస్యలను, గైనకాలజిస్టులు, స్పెషలిస్టులు పర్యవేక్షిస్తారని తెలిపారు. వీరికి అత్యవసర వైద్య సేవలు అందించడంతో భోజన వసతి కల్పించామన్నారు. సూపరింటెండెంట్ కె. మహేశ్‌బాబు, గైనకాలజిస్టు డాక్టర్ పి. శ్వేత, డాక్టర్ వివేక్ నాయక్, చిల్డ్రన్ స్పెషలిస్టు డాక్టర్ ప్రజ్వల పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వీర్యానికి కుట్ర

– సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



అరకులోయ వైఎస్సార్ కూడలిలో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

అరకులోయ రూరల్: విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ఎవడబ్బసొత్తు కాదని, ఎంతో మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న ఆస్తి అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి బడాబాబులకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. నాయకులు రాజు, సింహాద్రి, సింహాచలం, హరి, శ్రీను పాల్గొన్నారు.

రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



చట్రాపల్లి ఘటనపై చంపంగిగొంది వద్ద వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సంధ్యారాణి

సీలేరు: జిల్లాలో భారీ వర్షాలకు దెబ్బతిన్న మారుమూల గ్రామాల రహదారులు, వంతెనలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశించారు. చట్రాపల్లిలో కొండచరియలు విరిగిపడిన ఘటన వివరాలు తెలుసుకునేందుకు ఆమె చంపంగిగొంది వద్దకు వచ్చారు. కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ నుంచి ఘటన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అరకు పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రహదారులను దశలవారీగా నిర్మిస్తామని తెలిపారు. చట్రాపల్లిలో 33 గిరిజన కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందిస్తామని, మృతి చెందిన 60 కోళ్లు,70 మేకలకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. సీఎం దృష్టికి తీసుకువెళ్లి సీలేరు వరకు 40 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పీవో అభిషేక్, ఏఎస్పీ ధీరజ్, మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు.

గిరిజనుల నిరాశ

జీకే వీధి మండలంలో పర్యటించిన మంత్రి సంధ్యారాణిని కలిసేందుకు కలిసేందుకు నిమ్మలగొంది గిరిజనులు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వేచి ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆమె రాకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు.

తెల్లరాయి క్వారీపై విచారణకు ఆదేశం

చింతపల్లి: తెల్లరాయి క్వారీతో అనేక వ్యాధులు సోకడమే కాకుండా తాగునీరు కలుషితం అవుతోంది, పంటలు నాశనమవుతున్నాయని మంత్రికి తెరపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణ చేసి క్వారీ నిలిపివేతకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో ఆశాజ్యోతి పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు



మృతి చెందిన సూరిరెడ్డి(ఫైల్)

వై.రామవరం : స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కనిపించకుండా పోయిన వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేశారు. ఈనెల 5వ తేదీ రాత్రి మండలంలోని దేవరమడుగుల గ్రామానికి చెందిన లోత సూరిరెడ్డి(33) కనిపించకుండా పోయిన విషయం విదితమే. అతని ఆచూకీ లభించక పోవడంతో 6వ తేదీ రాత్రి అతని భార్య లోత వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే దేవరమడుగుల గ్రామం వెనుక కొండపైన అడవిలో సూరిరెడ్డి మృతదేహం ఉందన్న సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం అడ్డతీగల సీఐ బి.నరసింహారావు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్, వారి సిబ్బంది గ్రామస్తుల సహాయంతో కొండపైకి వెళ్లి మృతదేహాన్ని గుర్తించారు. రాత్రి అయిపోవడంతో పాడైన మృతదేహాన్ని కిందికి తేలేకపోయామని, సిబ్బందిని, గ్రామస్తులను కాపలా ఉంచామని సీఐ తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వరదలకు అతలాకుతలం

- ప్రకృతి విలయతాండవానికి రహదారులు, వంతెనలు ధ్వంసం
- గిరిజన గ్రామాల మధ్య తెగిపోయిన సంబంధాలు



కొట్టుకుపోయిన అగ్రహారం బ్రిడ్జి



సీలేరు సమీపంలో కొండచరియల తొలగింపు

సీలేరు: మారుమూల అటవీ ప్రాంతంలో ఐదు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు గిరిజన గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. హుద్‌హుద్ తుపానును తలదన్నేలా ప్రకృతి విలయ తాండవం చేసింది. కొండ గెడ్డల ప్రవాహాలకు వాగులు, వంతెనలు కొట్టుకుపోయాయి. రహదారులు ధ్వంసమయ్యాయి. అంతరరాష్ట్ర రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి.గిరిజన గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. పిల్లిగెడ్డ వాగు ఉధృతి ఇప్పటికీ తగ్గలేదు. అగ్రహారం వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. ఆంధ్ర -తెలంగాణ సరిహద్దు వలసగెడ్డ వంతెనను తాత్కాలికంగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. దీంతో ఎంపీటీసీ కనకా రమణ వలసగెడ్డ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి మంగళవారం సాయంత్రానికి రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టారు.

వరద ఉధృతికి కోతకు గురైన రహదారులు



రహదారికి పడిన గండిని చూపిస్తున్న స్థానిక గిరిజనుడు



చింతూరు, మారేడుమిల్లి ఘాట్‌రోడ్‌లో కోతకు గురైన రహదారి



వర్షాలకు దెబ్బతిన్న అరగడాపల్లి-కొక్కిరాపల్లి మెటల్ రోడ్డు

రాజవొమ్మంగి: లబ్బర్తి గ్రామం వద్ద చిన్నేరు వరద ప్రవాహానికి ప్రధాన రహదారి కొంతమేర కొట్టుకుపోయింది. ఈ రహదారిపై లోతుగా గండిపడటంతో ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే వాగుకు చెందిన కల్వర్టు దెబ్బతినడంతో పాటు రహదారికి గండి పడటంతో పది గ్రామాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘాట్‌రోడ్‌లో..

చింతూరు: మారేడుమిల్లి, చింతూరు రహదారిలో ఘాట్‌రోడ్ కోతకు గురవుతోంది. చింతూరు మండలం తులసిపాక సమీపంలోని వ్యూ పాయింట్ దాటిన తర్వాత కల్వర్టు వద్ద రహదారి బెర్ములు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. గతంలోనే ఈ ప్రాంతంలో గొయ్యి ఏర్పడడంతో అధికారులు ముందస్తుగా దాని చుట్టూ కర్రలను ఏర్పాటు చేసి హెచ్చరికగా స్టిక్కర్లు ఉంచారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు దిగువన వాగు ఉధృతికి మట్టి కొట్టుకుపోవడంతో మూడు అడుగుల మేర రహదారి కోతకు గురైంది. ఈ మార్గంలో నిత్యం బస్సులు, లోడ్ లారీలు, ఇతర వాహనాలు వందల సంఖ్యలో తిరుగుతుంటాయి. భారీ వర్షాలు కురిస్తే రహదారి మరింత కోతకు గురయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతోంది.

అరగడాపల్లి–కొక్కిరాపల్లి రోడ్డు

జి.మాడుగుల: మండలంలో మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు అరగడాపల్లి-కొక్కిరాపల్లి మెటల్ రోడ్డు కోతకు గురయింది. దీంతో ఆటో, జీపులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డు మధ్యలో పెద్ద గోతులు ఉండటంతో వాహన రాకపోకలు సాగే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చింతలూరులో ప్రత్యేక వైద్య శిబిరం



రోగులను పరీక్షించి మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లి: చింతలూరులో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం జరిగింది. ఇక్కడ డయేరియా ప్రబలడంతో వైద్యాధికారులు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లంబసింగి పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రెబక, హెల్త్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు, ఏఎన్ఎం సోములమ్మ పాల్గొన్నారు.

కూలిన గిరిజన ఇళ్లు



పెంకుటిల్లు కూలిపోవడంలో చూపుతున్న బాధిత గిరిజనుడు కొండలరావు



పెద్దపాడులో కూలిన ఇల్లు



మృత్యువాత పడిన మేక వద్ద గిరిజనుడు

దుంబ్రిగుడ: వర్షాలతో సోమవారం రాత్రి 8:30 గంటల సమయంలో కమ్మిడి కొండలరావు మట్టి పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయింది. ఆ సమయంలో తండ్రీకుమార్తె సమీపంలో కుమారుడు కమ్మిడి దిలీప్ కుమార్ ఇంటికి భోజనాలకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ విషయమై బాధితుడు కొండలరావు స్థానిక తహసీల్దార్ నాగమ్మకు సమాచారం అందించి పేదవాడైన తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.



సొవ్వాలో మృతి చెందిన పాడి ఆవు

పోతంగి పంచాయతీ పెద్దపాడు గ్రామానికి చెందిన బడ్‌నాయుడు మల్లేశ్వరావు అనే గిరిజనుడి మట్టి గృహం నేలమట్టం అయ్యిందని వీఆర్‌వో ఝాన్సీలక్ష్మి తెలిపారు. నష్టపరిహారం కోసం నివేదిక పంపించామన్నారు.

భారీ వర్షాలకు జీవాలు మృత్యువాత

వర్షాల కారణంగా కురిడి పంచాయతీ పుట్టబందలో కిలో ధనుర్జయ్‌కు చెందిన మేక, సొవ్వా పంచాయతీ పనసవలసలో జన్ని సింహాద్రి పాడిఆవు మృతి చెందాయి. జీవాలు మృత్యువాత పడుతుండటంలో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

గెడ్డలు దాటితేనే తిండి గింజలు



రేషన్ కోసం ప్రమాదకర గెడ్డ దాటుతున్న గిరిజనులు

దుంబ్రిగుడ: గిరిజనులకు నెలంతా జీవనం గడవాలంటే వాగులు, గెడ్డలు దాటాల్సిందే.. లేదంటే ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. మండలంలోని కోసంగ, పెద్దపాడు, శీలంగొంది, చంపపట్టి గిరిజనులు సంపంగి గెడ్డలను దాటుతూ భారీ వర్షాలను సైతం లెక్క చేయకుండా నిత్యావసర సరకులు తీసుకెళ్తున్నారు. కొంత మంది ఆస్పత్రులకు ప్రభుత్వ కార్యాలయాలకు తప్పనిసరి పరిస్థితిలో వారి ప్రాణాలను పణంగా పెట్టి పొంగుతున్న గెడ్డలను దాటి వెళ్తున్నారు. గెడ్డలను దాటే సమయంలో కొంత మంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చాపరాయి వద్ద వంతెన నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.